
# సాక్షి పల్నాడు

శుక్రవారం । 22 । నవంబర్ । 2024



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 584.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,200 క్యూసెక్కులు వదిలారు.



## సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 3800 క్యూసెక్కులు విడుదల చేశారు.



## నయనపర్వం శ్రీకృష్ణ పారిజాతం

కూచిపూడి(మొవ్వ): కూచిపూడిలో గురువారం డాక్టర్ శుభ మరువాడ(అమెరికా)శిష్యబృందం ప్రదర్శించిన శ్రీకృష్ణ పారిజాతం కూచిపూడి నృత్యరూపకం నయనపర్వంగా సాగింది.

## న్యూస్‌రీల్

### కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

**కలెక్టర్ అరుణ్‌కుమార్ వెల్లడి**

**నరసరావుపేట:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నూతన రేషన్ కార్డుల కోసం డిసెంబరు రెండో తేదీ నుంచి 28 లోపల దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్డులకు సంబందించి ఆధార్ సీడింగ్, స్ప్లిటింగ్ ఆఫ్ రేషన్ కార్డు, కార్డులో కుటుంబ సభ్యుల చేర్పడం వంటి పనులు చేస్తారని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 6,45,110 కార్డులు ఉండగా వీటన్నింటినీ మార్చి కొత్త కార్డులు సంక్రాంతి నాటికి అందజేస్తారని వెల్లడించారు.

### ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పేపర్ ఆవిష్కరణ



**నరసరావుపేట ఈస్ట్:** జాతీయస్థాయిలో 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. పల్నాడు బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన ఎన్‌ఎంఎంఎస్ మోడల్ గ్రాండ్ టెస్ట్ పేపర్‌ను గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిసెంబర్ 8న జరగనున్న పరీక్షలో అధిక శాతం విద్యార్థులు ఉత్తీర్ణులై స్కాలర్‌షిప్‌లు పొందాలని ఆకాంక్షించారు. మోడల్ పేపర్ తయారుచేసిన ఉపాధ్యాయులు ఎం.శివశంకర్, ఎస్.రమేష్‌లను అభినందించారు. జిల్లా బాలికల విద్యాభివృద్ధి అధికారిణి దొండేటి రేవతి, బాలోత్సవ్ కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కాలువలో ఇద్దరు చిన్నారులు గల్లంతు



**వినుకొండ:** సాగర్ ప్రధాన కాలువలో పడి ఇద్దరు చిన్నారులు గల్లంతైన ఘటన గురువారం ఈపూరు మండలం ముప్పాళ్ల వద్ద జరిగింది. వనికుంట గ్రామానికి చెందిన విలేకరి వెంకట నాగాంజనేయ శర్మ, తన ఇద్దరు కూతుర్లు యామిని(11), కావ్య(7) ఉదయం 8.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంతో సహ ఎన్‌ఎస్పీ కాలువలో పడ్డారు. కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో చిన్నారులు యామిని, కావ్య నీటమునిగినట్టు తెలుస్తోంది. నీటిలో కొట్టుమిట్టాడుతున్న శర్మ స్థానికుల సహాయంతో బయటపడ్డాడు. విషయం తెలిసిన ఈపూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చిన్నారుల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. చిన్నారులు మునిగిన చోట లోతు అధికంగా ఉండటంతో స్థానిక ఈతగాళ్లు పిల్లల ఆచూకీ తెలుసుకోలేకపోయారు. దీంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్టు స్థానిక ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

### 23న జెడ్పీ సర్వసభ్య సమావేశం

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశం ఉంటుంది. ఈ మేరకు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షత వహించనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు. వ్యవసాయ అనుబంధ శాఖలతోపాటు గృహ నిర్మాణం, విద్య, వైద్యారోగ్య, జలవనరులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఉపాధి హామీపై అజెండాలో పొందుపర్చిన అంశాలపై సమీక్ష ఉంటుందని సీఈవో పేర్కొన్నారు.

### ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే సహించేది లేదు

**జిల్లా మైనింగ్ అధికారి రాజేష్**

**బాపట్లటౌన్:** జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే సహించేది లేదని జిల్లా మైనింగ్ అధికారి రాజేష్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మండలంలోని వెదుళ్లపల్లి సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా చేసినా, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపినా సహించేది లేదన్నారు.

సత్తెనపల్లిలోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహం





# వసతి గృహపాట్లు

## ఎస్సీ బాలికల వసతి గృహంలో సమస్యల వలయం

- అరకొర వసతులతో చదువులు
- మోటార్ నీరే తాగడానికి.. అవసరాలకు..
- నాణ్యతలేని అల్పాహారం, ఆహారపదార్థాలు
- పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు అధ్వానం
- వార్డెన్ వేధింపులతో ఇటీవల ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం
- కానరాని సీసీ కెమెరాలు, భద్రతా చర్యలు శూన్యం
- పట్టించుకోని పాలకులు, యంత్రాంగం



అధ్వానంగా ఉన్న వసతి గృహ పరిసరాలు

**సత్తెనపల్లి:** స్థానిక వెంకటపతి నగర్‌లోని ఎస్సీ బాలికల వసతి గృహంలో కనీస వసతులు కరువయ్యాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. మోటార్ నీరే తాగడానికి, అవసరాలకు వినియోగించాల్సిన దుస్థితి నెలకొంది. నాణ్యత లేని ఆహారంతో బాలికలు సతమతమవుతున్నారు. భద్రత ప్రశ్నార్థకంగా మారింది. వార్డెన్ వేధింపులతో ఇటీవల ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యాయత్నం చేశారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. వసతుల కల్పనకు చర్యలు చేపట్టడం లేదు. ఇటీవల సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా అధికారుల్లో చలనం లేదు. గురువారం 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైన నిజాలివీ..

### పనిచేస్తేనే పేరెంట్స్‌తో మాట్లాడేందుకు ఫోన్!

వసతి గృహంలో కూరగాయలు తరగడం, గడ్డి పీకడం, నీటిని పట్టడం వంటి పనులు చేస్తేనే విద్యార్థినులకు పేరెంట్స్‌తో మాట్లాడడానికి ఫోన్ ఇస్తారని, పనులు చేయని వారికి ఇవ్వరని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే సిబ్బంది దుర్భాషలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారయంత్రాంగం స్పందించి హాస్టల్‌లో వసతులు మెరుగుపరచాలని, మెనూ ప్రకారం తాజా ఆహారపదార్థాలు వడ్డించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### 297 మందికి ఒకటే మరుగుదొడ్డి

ఈ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని 2014లో రూ.2.50 కోట్లతో నిర్మించారు. ఈ హాస్టల్లో ఇంటర్మీడియెట్, నర్సింగ్ (జీఎన్‌ఎమ్, ఏఎన్‌ఎం), డిగ్రీ విద్యార్థినులు 297 మంది ఉంటున్నారు. కూటమి సర్కారు అధికారం చేపట్టాక ఈ హాస్టల్ నిర్వహణ అధ్వానంగా మారింది. వసతి గృహాలకు బడ్జెట్ కేటాయించకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందన్న వాదన వ్యక్తమవుతోంది. బ్లీచింగ్, ఇతర వస్తువుల కొనుగోలుకూ వార్డెన్ సొంత డబ్బులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ హాస్టల్లో కిటికీలకు తలుపులు లేవు. చలికి తోడు దోమల బెడద. దోమ తెరలు లేవు. మరుగుదొడ్లకు తలుపులు లేవు. ఒక మరుగుదొడ్డి పనిచేయడం లేదు. స్తంభించింది. 297 మందికి ఒకటే మరుగుదొడ్డి. అదీ దుర్గంధం వెదజల్లుతోంది. తాగునీటి వసతి లేదు. అన్ని అవసరాలకు మోటార్ నీరే గతి.



వసతి గృహంలో తలుపులు లేని బాత్‌రూమ్‌లు

### పాచి ఆహారపదార్థాలే గతి!



నాణ్యతలేని అల్పాహారం, భోజనం

హాస్టల్లో మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందడం లేదు. వారంలో రెండు రోజులు మాత్రమే అల్పాహారం వడ్డిస్తున్నారు. మిగిలిన రోజుల్లో రాత్రి వండిన అన్నమే గతి. మధ్యాహ్నం మిగిలిన అన్నం, కూరలను సాయంత్రం వడ్డిస్తున్నారు. అదేమని విద్యార్థినులు ప్రశ్నిస్తే సిబ్బంది అవమానకరంగా మాట్లాడతున్నారు. వేధిస్తున్నారు. ఈ కారణంగానే ఇటీవల ఇంటర్మీడియెట్ విద్యార్థినులు సంగం అఖిల, అన్నవరపు సనిత ఆత్మహత్యాయత్నం చేశారు. కొందరు విద్యార్థినులు ఈ ఆహారం తినలేక పాకెట్ మనీతో బయట అల్పాహారం, కురుకురే ప్యాకెట్లు కొని తిని అనారోగ్యం పాలవుతున్నారు.

### బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాలకు ఆహ్వానం

**గుంటూరు రూరల్:** ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరానికి బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి విద్యార్థులను ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 26వ తేదీన ఈ మేరకు వాక్‌ఇన్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసెట్ 2024లో అర్హత పొందిన అభ్యర్థులు, దరఖాస్తు చేసుకున్న, చేయని వారు కూడా నిర్ణీత రుసుం చెల్లించి హాజరుకావచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ లో చూడాలని సూచించారు.

### నేడు ఐఎంఏ రాష్ట్ర సదస్సు

**గుంటూరు మెడికల్:** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు బ్రాంచ్ 66వ వార్షిక సదస్సు శుక్రవారం ఉదయం 9 గంటలకు జరగనుంది. గుంటూరు వైద్య కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో ఇది ప్రారంభమవుతుందని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ టి. సేవకుమార్ గురువారం తెలిపారు. ప్రారంభోత్సవ సభలో గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, జి.జి.హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ఎస్.ఎస్.వి, ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పి.ఫణిధర్, కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ జి నందకిషోర్, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ సి.హెచ్. విశ్వేశ్వరరావు, ఐఎంఏ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. కిషోర్ తదితరులు పాల్గొంటారన్నారు. ప్రారంభోత్సవ సభ అనంతరం పలు అంశాలపై వర్క్ షాప్ ఉంటుందని చెప్పారు. వర్క్‌షాప్‌లో ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొంటారన్నారు.

### 14న జాతీయ లోక్ అదాలత్

**నగరంపాలెం:** జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో వచ్చే నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు.

# టీడీపీ పెద్దల కుట్ర మేరకే నాపై కేసు

- ఎటువంటి సాక్ష్యాలు లేకుండా కేసు నమోదు చేయటం దుర్మార్గం
- ఫిర్యాదిదారుడు మతిస్థిమితం లేని ఒక బ్లాక్ మెయిలర్
- బిహార్ నుంచి తుపాకీ తెచ్చి కాల్చేస్తానని ఫిర్యాది అంటున్నాడు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



**నరసరావుపేట:** తెలుగుదేశం పార్టీ పెద్దల కుట్ర, ఆ పార్టీ సెంట్రల్ ఆఫీస్ ఆదేశాల మేరకే తనపై అక్రమ కేసు పెట్టారని, దీనికి భయపడేది లేదని, చట్టపరంగా పోరాడతామని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం గుంటూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి సాక్ష్యాలు లేకుండా అవాస్తవ ఆరోపణలతో ఒక మతి స్థిమితంలేని బ్లాక్‌మెయిలర్ చేస్తున్న ఆరోపణల మేరకు రెండుసార్లు ఎమ్మెల్యేగా వ్యవహరించిన తనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అక్రమ కేసు బనాయించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. ఫిర్యాది, పమిడిపాడు గ్రామానికి చెందిన చెందిన కొల్లా సాంబశివరావు ఎవరో తనకు తెలియదని, అతని ముఖం కూడా ఇప్పటివరకు చూడలేదని స్పష్టం చేశారు. అతను ఎవరా అని ఆరా తీస్తే, గుంటూరుకు చెందిన కామరాజు అనిల్‌కుమార్ వద్ద 6.10 ఎకరాల భూమి కొనేందుకు సాంబశివరావు గతంలో అడ్వాన్స్ చెల్లించి 2021 వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోయా డని, కొందరు రాజకీయ నాయకులను పట్టుకొని అప్పుడు ఉన్న డీఎస్పీ వద్ద పంచాయితీ చేసుకున్నాడని తెలిసిందని పేర్కొన్నారు. ఆ భూమి రిజిస్ట్రేషన్ సమయంలో సాంబశివరావు వద్ద డబ్బులు లేకపోతే నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన రవికిషోర్‌రెడ్డి ఆ డబ్బు ఇచ్చి తన బంధువైన తాటిపర్తి కోటిరెడ్డి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాడని, అప్పుడే అనిల్‌కుమార్‌కు, తనకు ఎలాంటి వివాదాలూ లేవని సాంబశివరావు ఒప్పందపత్రం రాసిచ్చాడని వివరించారు. ఇప్పుడు ఆ భూమిపై ఎలాంటి హక్కు లేని సాంబశివరావు బ్లాక్‌మెయిల్ చేస్తూ తనపై కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బిహార్ నుంచి తుపాకీ తెప్పించి తమను కాల్చేస్తానని సాంబశివరావు బెదిరిస్తున్నాడని, చూస్తుంటే అతనికి మతిస్థిమితం లేనట్టు ఉందని పేర్కొన్నారు. పోలీసులు ఎలాంటి విచారణ చేయకుండా, ఏం జరిగిందో తెలుసుకోకుండా కేసు పెట్టడం సరికాదని గోపిరెడ్డి అభిప్రాయపడ్డారు. టీడీపీ పెద్దల ఒత్తిడి మేరకే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు పలికారన్న సాకుతో పోలీసు ఉన్నతాధికారులపైనా అక్రమ కేసులు పెడుతున్నారని, ఈ పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదని గోపిరెడ్డి విస్మయం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో అక్రమ కేసులు పెట్టిన వారు భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని హెచ్చరించారు. కేసులకు భయపడేది లేదని, చట్టపరంగా పోరాడతామని తేల్చిచెప్పారు. సాంబశివరావు, అనిల్‌కుమార్ రాసుకున్న ఒప్పంద పత్రం, ఆ భూమి రిజిస్ట్రేషన్ పత్రాలను గోపిరెడ్డి విలేకరులకు చూపించారు.

## వలంటీర్లను నమ్మించి నట్టేట ముంచిన ఎన్డీఏ కూటమి

**సోషల్ యాక్టివిస్టు, రచయిత ఈదర గోపీచంద్**



**నరసరావుపేట:** మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని, అలాంటి వలంటీర్లను ఎన్డీఏ సర్కారు నమ్మించి నట్టేట ముంచడం అమానవీయమని, కుట్రపూరితమని సోషల్ యాక్టివిస్టు, రచయిత ఈదర గోపీచంద్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వలంటీర్ల వ్యవస్థ ఆగస్టు 23 నాటికే ఉనికిలో లేదని అసెంబ్లీ సాక్షిగా మంత్రి జంకు లేకుండా అబద్ధాలు వల్లెవేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. మరి మొన్నటి బడ్జెట్ ప్రకారం ఏప్రిల్, మే నెలల జీతాలు ఎలా ఇచ్చారని, బుడమేరు వరద బాధితుల సేవలకు చివరి నిమిషంలో వలంటీర్లను వాడుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు వలంటీర్ల జీతం రూ.పదివేలకు పెంచి వారిని కొనసాగిస్తానని చంద్రబాబు ప్రకటించి ఇప్పుడు మాట తప్పారని విమర్శించారు. రెండున్నర లక్షల మందికిపైగా వలంటీర్లకు అన్యాయం చేయడం తగదని పేర్కొన్నారు. వలంటీర్లు ఈ ప్రభుత్వంపై పోరాటాన్ని కొనసాగించాలని ఈదర గోపీచంద్ పేర్కొన్నారు.

### రిటర్నబుల్ ప్లాట్లకు రేపు ఈ-లాటరీ

**తాడికొండ:** అమరావతి నిర్మాణం కోసం ఏపీసీఆర్డీఏ పరిధిలో భూ సమీకరణలో భూములు అప్పగించిన రైతులకిచ్చే రిటర్నబుల్ ప్లాట్లకు ఈ నెల 23వ తేదీన ఈ-లాటరీ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీసీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ-లాటరీ ఉంటుందన్నారు. అమరావతి 9 గ్రామాల్లోని రైతులకు ఆన్‌లైన్ ద్వారా ప్లాట్లను కేటాయించనున్నట్లు తెలిపారు. ఉదయం కొన్ని గ్రామాలకు, మధ్యాహ్నం కొన్ని గ్రామాలకు లాటరీ ప్రక్రియ చేపడతామని కాటంనేని భాస్కర్ తెలిపారు.

# విధుశేఖరుని విజయయాత్ర

- పాతూరులో రథాన్ని ప్రారంభించిన విధుశేఖర భారతీస్వామి
- నరసరావుపేటలో రెండోరోజూ దిగ్విజయంగా యాత్ర
- కోటప్పకొండ త్రికోటేశ్వరునికి ప్రత్యేక పూజలు
- మిన్నెకల్లులో కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ



రథాన్ని ప్రారంభిస్తున్న విధుశేఖర భారతీ స్వామి

**నరసరావుపేట ఈస్ట్:** శ్రీ శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి నిర్వహిస్తున్న విజయయాత్ర నరసరావుపేటలో దిగ్విజయంగా సాగింది. రెండు రోజుల పాటు స్వామి పట్టణంలోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనుగ్రహభాషణతోపాటు భక్తులకు ఆశీస్సులు అందించారు. బుధవారం రామిరెడ్డిపేటలో ప్రారంభించిన వేద పాఠశాల వసతి గృహం నుంచి గురువారం ఉదయం భారతీ స్వామి పర్యటన ప్రారంభించారు. పాతూరులోని భీమలింగేశ్వర స్వామి గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. నగరోత్సవ రథాన్ని ప్రారంభించారు. గురువర్యులు శృంగేరి శారదా పీఠాధిపతి భారతీతీర్థ మహాస్వామి చేతుల మీదుగా భీమలింగేశ్వర స్వామి గుడిలో ఆరేళ్ల క్రితం కుంభాబిషేకం నిర్వహించడం మదిలో మెదులుతుందని పేర్కొన్నారు. అనంతరం అక్కడి నుంచి చెరువుకట్ట వీధిలోని చౌడేశ్వర అమ్మ గుడికి చేరుకుని పూజాధికాల్లో పాల్గొన్నారు. పాతూరులోని పాత శంకరమఠంను సందర్శించారు. అనంతరం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దర్శనానికి తరలివెళ్లారు. ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత మిన్నెకల్లుకు చేరుకుని కల్యాణ మండపం భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరిగి నరసరావుపేట చేరుకున్న విధుశేఖర స్వామి శంకర మఠంలో నిర్వహించిన బ్రహ్మశ్రీ తంగిరాల వెంకటేశ్వరావధానులు స్మారక వేదసభలో పాల్గొన్నారు. అనుగ్రహభాషణం చేశారు.



వేదపాఠశాల వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న స్వామి

### కోటప్పకొండలో..

**నరసరావుపేట రూరల్ :** కోటప్పకొండలో స్వామి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు విధుశేఖరుని వద్ద కుంభాభిషేకం విషయం ప్రస్తావించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ విజయయాత్ర ముగిసిన అనంతరం శృంగేరి పీఠానికి వచ్చి గురువర్యులను కలుసుకొని ఆలయంలో చేపట్టవలసిన పూజాధికాలపై ముహూర్తం నిర్ణయం చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామకృష్ణ కొండలరావు, ఈవో డి.చంద్రశేఖరరావు, ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొండకావూరి వెంకటప్పయ్య గురుకుల్, కిరణ్‌కిషోర్‌శర్మ పాల్గొన్నారు.



త్రికోటేశ్వరుని దర్శించుకున్న భారతీస్వామి

# ఖోఖో ఖేలాహాలం

- కారెంపూడిలో మూడు దశాబ్దాల తర్వాత రాష్ట్రస్థాయి క్రీడలు
- రేపటి నుంచి మూడు రోజులపాటు అండర్-14 ఖోఖో పోటీలు
- ముస్తాబవుతున్న బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం



ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

**కారెంపూడి:** రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడలకు కారెంపూడి ముస్తాబవుతోంది. ఈనెల 23, 24, 25 తేదీలలో జరగనున్న పోటీలకు స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ వేదిక కానుంది. ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ కారెంపూడిలో రాష్ట్ర స్థాయి క్రీడలు జరగనుండడం విశేషం. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి అండర్ 14 బాల, బాలికల ఖోఖో పోటీలు జరగనున్నాయి. మొదట 1996లో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్లో అండర్-18 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు జరిగాయి, ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే రాష్ట్ర స్థాయి పోటీలకు కారెంపూడి వేదికవుతోంది. రాష్ట్ర నలుమూలల నుంచి 400 మంది క్రీడాకారులు కారెంపూడి రానున్నారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు పోటీలలో పాల్గొంటున్నాయి. వంద మంది వరకూ పీఈటీలు పోటీల నిర్వహణలో పాల్గొనబోతున్నారు. వారితోపాటు క్రీడా శిక్షకులు, క్రీడా సంస్థల అధికారుల రాకతో కారెంపూడి జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం సందడిగా మారనుంది.



పోటీలు జరగనున్న బ్రహ్మనాయుడు హైస్కూల్ ప్రాంగణం

### విజయవంతం చేయాలి



గ్రామస్తులు, పెద్దల సహకారం కూడా తీసుకుని పోటీలు అట్టహాసంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నాం. కారెంపూడి ప్రతిష్ఠ పెంచేలా క్రీడాకారులకు ఏ లోటూ రాకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల నుంచి 13 బాలికల జట్లు, 13 బాలుర జట్లు పోటీలలో పాల్గొంటున్నాయి. పోటీల నిర్వహణకు పాఠశాల క్రీడాప్రాంగణాన్ని తీర్చిదిద్దుతున్నాం. ప్రతి ఒక్కరూ పోటీలను విజయవంతం చేయడంలో సహకారం అందించాలి.

–బి.స్వర్ణరాజు, క్రీడా నిర్వహణ కార్యదర్శి, జెడ్పీ హైస్కూల్, కారెంపూడి

### వసతి సౌకర్యాల ఏర్పాట్లు



వసతి, సౌకర్యాల కల్పనకు పాఠశాల విద్యాకమిటీ, పూర్వ విద్యార్థుల సంఘాలు సహకారం అందిస్తున్నాయి. కారెంపూడిలోని మిగిలిన పాఠశాలలు కూడా వచ్చే క్రీడాకారులకు వసతి సమకూరుస్తున్నాయి. బాలికల జట్లకు ట్రైబల్ వెల్ఫేర్, ఆదర్శ పాఠశాలలలో వసతి కల్పించారు. అలాగే బాలుర జట్లకు బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో ఒక బ్లాకును మెయిన్ స్కూల్లో మరో బ్లాకును కేటాయించారు.

–జె.శ్రీనివాసరావు, పీఈటీ, జెడ్పీ హైస్కూల్, కారెంపూడి

## క్లుప్తంగా

### మాచర్లలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి

**నరసరావుపేట ఈస్ట్:** ఎన్ఎంఎంఎస్ పరీక్ష కేంద్రాన్ని మాచర్ల పట్టణంలో ఏర్పాటు చేయాలని పల్నాడు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ బెజ్జం సంపత్‌బాబు, సెక్రటరీ జనరల్ వి.అశోక్‌కుమార్ గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోనే పరీక్ష కేంద్రం ఉందని, మాచర్ల ప్రాంతం నుంచి పరీక్ష రాసేందుకు రావటం విద్యార్థులకు వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారమని తెలిపారు. మాచర్ల, పరిసర పాఠశాలల నుంచి దాదాపు 300 మంది 8వ తరగతి విద్యార్థులు పరీక్ష రాసేందుకు సన్నద్ధమవుతున్నారని పేర్కొన్నారు.

### రేపు స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపిక

**నరసరావుపేట ఈస్ట్:** పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. డిసెంబర్ 7, 8 తేదీలలో విశాఖలో జరగనున్న 9వ వింటర్ సబ్ జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఈ జట్లను ఎంపిక చేస్తున్నట్టు వివరించారు. అండర్-11, అండర్-14, అండర్-17 విభాగాలలో జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 23న ఉదయం 8 గంటలకు స్విమ్మింగ్‌పూల్ వద్దకు రావాలని సూచించారు. ఇతర వివరాలకు 8296374963 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### రైలు కింద పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



**పిడుగురాళ్ల:** రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని ఒంటిగేటు వద్ద బుధవారం రాత్రి జరిగింది. భవనాశి శ్రీనివాసరావు(48) మతిస్థిమితం లేకుండా ఉండేవాడని, ఈ క్రమంలోనే రాత్రి ఎవరికి తెలియకుండా ఒంటిగేటు వద్దకు వెళ్లి రైలు కింద పడ్డాడని బంధువులు తెలిపారు. ఇతనికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.



# పత్తికి మద్దతు ధర చెల్లించాలి

**ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు డిమాండ్**



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

**సత్తెనపల్లి:** పత్తి క్వింటాకు రూ.7,521 మద్దతు ధర చెల్లించాలని, పత్తి కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల్లోనే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. నిబంధనల పేరుతో పత్తి కొనుగోలుకు సీసీఐ కేంద్రాలు నిరాకరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిబంధనలను సడలించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర చెల్లించడం లేదని వివరించారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై రాధాకృష్ణ మాట్లాడుతూ ఈనెల 26న పత్తి రైతులతో కలిసి నరసరావుపేట కలెక్టరేట్ వద్ద భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కామినేని.రామారావు, సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్‌లు పాల్గొన్నారు.

## ముత్తూట్ ఫైనాన్స్‌రెడ్‌పై ఫిర్యాదులు



**సత్తెనపల్లి:** స్థానిక ముత్తూట్ ఫైనాన్స్ రెడ్ బ్రాంచ్‌లో అవకతవకలు జరిగినట్లు పలువురు ఖాతాదారులు ఆరోపిస్తూ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదులు చేశారు. ముప్పాళ్ళ మండలం నార్నెపాడు గ్రామానికి చెందిన వెల్లంపల్లి విజయ్‌కుమార్ 20 గ్రాముల బంగారు ఆభరణాలను కుదవపెట్టి గత ఏప్రిల్ 19న రూ.60 వేలు, ఆయన భార్య 33.5 గ్రాములు బంగారు నగలు కుదవ పెట్టి రూ.1.20 లక్షలు అప్పుగా తీసుకున్నారు. 20 గ్రాములకు రూ.98 వేలు, 33.5 గ్రాములకు రూ.1,60,050 చెల్లించాలని చెప్పడంతో విజయ్‌కుమార్ అవాక్కయ్యాడు. ఎందుకు చెల్లించాలని ప్రశ్నించటంతో వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ప్రతి నెలా వడ్డీ చెల్లిస్తున్నా ఎక్కువ మొత్తంలో చూపుతూ అవకతవకలకు సిబ్బంది పాల్పడినట్లు ఆరోపించాడు. దీనిపై విచారించి న్యాయం చేయాలంటూ విజయ్ కుమార్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే తరహాలో మరో ముగ్గురు కూడా ఆ బ్రాంచ్ సిబ్బందిపై ఫిర్యాదులు అందించారు.

## అర్ధరాత్రి షాపుల్లో దొంగతనాలు

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన షాపు యజమానులు
- ఆధారాలు సేకరించేందుకు రంగంలోకి దిగిన క్లూస్ టీం



దొంగతనం జరిగిన షాపుల్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

**పర్చూరు (చినగంజాం):** పర్చూరులోని ప్రధాన కూడలి బొమ్మల సెంటర్‌లో బుధవారం అర్ధరాత్రి దొంగలు పలు షాపుల్లో వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. స్థానిక చీరాల రోడ్డు, ఇంకొల్లు రోడ్డులోని షాపులలో బుధవారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో ఈ వరుస దొంగతనాలు చోటుచేసుకున్నాయి. చీరాల రోడ్డులోని ఆటోమొబైల్ షాపు, చిల్లరకొట్టులో దొంగతనం జరగగా, ఇంకొల్లు రోడ్డులోని సెల్‌ఫోన్ షాపు, డ్రైఫ్రూట్స్, మిల్క్ సెంటర్ షాపుల్లో దొంగతనాలు జరిగినట్లు షాపు యజమానులు గుర్తించారు. గురువారం ఉదయం షాపులు తెరచిన అనంతరం తమ షాపులలో దొంగతనాలు జరిగినట్లు గుర్తించిన యజమానులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుకు వెంటనే స్పందించిన ఎస్ఐ మాల్యాద్రి ఉన్నతాధికారులకు సమాచారమందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్లూస్ టీం వెంటనే రంగంలోకి దిగి దొంగతనాలు జరిగిన ప్రాంతంలో ఆధారాలను సేకరించారు. ఈ విషయమై ఎస్ఐను వివరణ కోరగా వరుస దొంగతనాలపై షాపు యజమానులను విచారిస్తున్నట్లు, దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను పట్టుకునేందుకు సత్వరం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

## రైల్వేగేటును ఢీకొట్టిన కారు



రైల్వేగేటు కిందకు దూసుకుపోయి నిలిచిన కారు

**చీరాల రూరల్:** రైల్వేగేటు మూసి ఉండగా ఓ కారు వేగంగా గేటులో నుంచి దూసుకుపోయి నిలిచిపోయింది. ఈ ఘటన గురువారం రాత్రి చీరాలలోని కారంచేడు రైల్వేగేటు సెంటర్లో చోటుచేసుకుంది. ఆర్పీఎఫ్ సీఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. దేవరంపాడుకు చెందిన రామకృష్ణ అనే వ్యక్తి తన కారును వేగంగా నడిపి మూసి ఉన్న గేటును ఢీకొట్టినట్లు చెప్పారు. ఆ సమయంలో పట్టాలపై ఓ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణించిందని, కారు పట్టాలపైకి చేరినట్లయితే పెనుప్రమాదం జరిగేదని సీఐ తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకుని కారు నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## వలంటీరు వ్యవస్థపై టీడీపీ ప్రకటన సిగ్గుచేటు

**వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్**



**రేపల్లె రూరల్:** వలంటీరు వ్యవస్థ లేదని, కొనసాగించబోమని శాసనమండలి సమావేశాల్లో రాష్ట్ర మంత్రి డోలా బాలవీరాంజనేయులు ప్రకటించడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవురు గణేష్ పేర్కొన్నారు. గుళ్లపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏరుదాటిన తర్వాత తెప్ప తగలబెట్టిన చందాన కూటమి నేతలు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు వలంటీరు వ్యవస్థను కొనసాగించడంతోపాటు నెలకు రూ.10,000 వేతనం అందిస్తామని చంద్రబాబు నాయుడుతోపాటు ఇతర కూటమి నేతలు ప్రచారం చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. తీరా గెలిచాక వలంటీర్లను మోసం చేశారన్నారు.

## మంత్రికి అవోపా సన్మానం



టీజీ భరత్‌ను సత్కరిస్తున్న అవోపా ప్రతినిధులు

**గుంటూరు ఎడ్యుకేషన్:** రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో గురువారం రాత్రి అమరావతి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, క్రేన్ గ్రూప్ అధినేత జీవీఎస్ కాంతారావు, అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, ప్రతినిధులు కేవీ బ్రహ్మం, రాచపూడి సుబ్బారావు, మద్దు రామకృష్ణయ్య, కొత్తమాసు ఏకానంద్ తదితరులు పాల్గొన్నారు.

## 339 పరుగులు చేసిన ఉత్తరప్రదేశ్

**మంగళగిరి:** నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో కల ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ట్రోఫీలో ఉత్తరప్రదేశ్ జట్టు 339 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర జట్టు బౌలర్లు ఎన్.రాజేష్ 5, బి.యశ్వంత్ 3 వికెట్లు తీసి రాణించారు. 126 ఓవర్లలో 339 పరుగులకు ఉత్తరప్రదేశ్ జట్టు ఆలౌటైంది. అనంతరం గురువారం బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర క్రికెట్ జట్టు 42.01 ఓవర్లలో 100 పరుగులకు కుప్పకూలింది. బ్యాటర్ తరుణ్ సాత్విక్ 32 పరుగులు చేశాడు. ఉత్తరప్రదేశ్ బౌలర్ దేవాన్ష్ చతుర్వేది మూడు వికెట్లు తీశాడు. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

## డాక్టర్ యశోదరకు షారోన్ అంతర్జాతీయ అవార్డు



**తెనాలి:** పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ పెన్నీ మినిస్ట్రీస్ ఏటా అందజేస్తున్న షారోన్ అంతర్జాతీయ అవార్డుకు తెనాలి వైద్యురాలు డాక్టర్ యశోదర పువ్వాడను జ్యూరీ ఎంపిక చేసింది. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి గురువారం వెల్లడించారు. కెనడాకు చెందిన డాక్టర్ షారోన్ జ్ఞాపకార్థం ఈ అవార్డు అందజేస్తున్నట్టు తెలిపారు. గతేడాది డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారదకు బహూకరించినట్లు ప్రదీప్ చెప్పారు. డాక్టర్ యశోదర తండ్రి డాక్టర్ సోమశేఖర్ తెనాలిలో పిల్లల వైద్యనిపుణులు కాగా, ఆమె భర్త డాక్టర్ కృష్ణసందీప్ తెనాలిలోని మైత్రి హాస్పిటల్ వ్యవస్థాపకుల్లో ఒకరు.

## నిధులు దారి మళ్లించిన ఉద్యోగిపై కేసు

**పట్నంబజారు:** గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన నిధులను దారి మళ్లించిన ఉద్యోగిపై గురువారం కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేసే సిరిల్‌పాల్ రూ. 17 లక్షలు నిధులను నిబంధనలకు విరుద్ధంగా దారి మళ్లించారు. అధికారుల విచారణలో ఈ విషయం తేలడంతో నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా సిరిల్‌పాల్‌పై ఇదే తరహా కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

## పోలీసుల అదుపులో సోషల్ మీడియా యాక్టివిస్ట్ గోపీలాల్

**పెదకాకాని:** పెదకాకాని గ్రామానికి చెందిన గోపీలాల్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2020లో సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టిన కారణంగా అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. పోలీసులు ముందుగా అతడిని పెదకాకాని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం పొన్నూరు స్టేషన్‌కు తీసుకెళ్లారు.

## టీడీపీ కార్యకర్తకు దేహశుద్ధి

**మంగళగిరి:** రత్నాల చెరువులో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన టీడీపీ కార్యకర్తకు దేహశుద్ధి చేసిన ఘటన చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు గురువారం తెలిపిన వివరాల మేరకు.. టీడీపీ కార్యకర్త గోలి రామాంజనేయులు రత్నాల చెరువులోని మహిళలను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళలు నిలదీయడంతో ఒంటిపై దుస్తులు తీసేసి బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద హల్‌చల్ చేశాడు. దీంతో ఆగ్రహించిన స్థానికులు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. వారు రామాంజనేయులును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆడిట్ కమిషనరేట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు

**లక్ష్మీపురం:** దేశంలోని 48 సి.జి.ఎస్.టి. ఆడిట్ కమిషనరేట్‌లలో గుంటూరు కమిషనరేట్‌కు యాన్యువల్ కంపోజిట్ గ్రేడింగ్‌లో 2023-24 ఆర్థిక ఏడాదికి ప్రథమ స్థానం దక్కింది. ఈ మేరకు ఢిల్లీలోని సి.జి.ఎస్.టి ఆడిట్ డైరెక్టరేట్ జనరల్ కార్యాలయం గురువారం వివరాలు వెల్లడించింది. వంద మార్కులకు గుంటూరు కార్యాలయం అత్యధికంగా 73.22 సాధించింది. ఇందుకు కారణమైన అధికారులకు ఆ శాఖ చీఫ్ కమిషనర్ సంజయ్ రాతీ, కమిషనర్ పి.ఆనంద్ కుమార్‌లు అభినందించారు.

# మినీ గోకులాల షెడ్లను సద్వినియోగం చేసుకోండి



ఉపాధి హామీ ఏపీడీ మల్లికార్జునరావు

**మాచర్ల:** మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో తొమ్మిది మండలాలకు 225 మినీ గోకులాల షెడ్లు మంజూరైనట్లు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కొరటా మల్లికార్జునరావు తెలిపారు. గురువారం మాచర్లలోని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మినీ గోకులాల షెడ్లు నిర్మాణాలపై మాట్లాడారు. ప్రతి మండలంలో 25 షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధి హామీ ద్వారా నిధులు మంజూరు చేసిందన్నారు. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో 225 షెడ్ల నిర్మాణాన్ని ఈనెలాఖరులోపు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక్కొక్క యూనిట్‌కు రూ.2.30 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అందులో లబ్ధిదారుడు షెడ్డు నిర్మించుకోవటానికి దరఖాస్తు చేసుకుంటే 10 శాతం చెల్లించాలన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

**స్వగ్రామం నెమలికల్లులో విషాదం**



వంగానవీన్‌రెడ్డి (ఫైల్)

**అమరావతి:** నెమలికల్లు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వంగా నవీన్‌రెడ్డి(24) గురువారం హైదరాబాద్‌లో తాను పనిచేస్తున్న కార్యాలయ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. నెమలికల్లు గ్రామానికి చెందిన వంగా శ్రీనివాసరెడ్డి, ప్రమీల దంపతులు తమకున్న రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ తమ ఇద్దరి కుమారులను చదివించారు. పెదవాడైన నవీన్‌రెడ్డి ఇటీవల ఇంజనీరింగ్ పూర్తిచేసుకుని హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. గురువారం తాను పనిచేస్తున్న ఆఫీసు భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చేతికందివచ్చిన కొడుకు ఇలా బలవన్మరణానికి పాల్పడడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. శ్రీనివాసరెడ్డి రెండో కుమారుడు ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం రాత్రికి నవీన్‌రెడ్డి మృతదేహం స్వగ్రామమైన నెమలికల్లు చేరుకుంది.

## ముగ్గురు చిన్నారులను రక్షించిన ఆర్పీఎఫ్ పోలీసులు

**పిడుగురాళ్ల:** రైలులో ఒంటరిగా ప్రయాణిస్తున్న ముగ్గురు చిన్నారులను గుర్తించి గుంటూరు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించినట్లు పిడుగురాళ్ల ఆర్పీఎఫ్ సీఐ కె.ఏడుకొండలు తెలిపారు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌లో గురువారం మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా జనరల్, స్లీపర్ బోగీలను తనిఖీ చేయటంతో అందులో ముగ్గురు బాలురు హౌరా నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్నట్లు గుర్తించారు. వారు కూలి పనులకు వెళ్తున్నారని తెలపటంతో అనుమానంతో ఆర్పీఎఫ్ పిడుగురాళ్ల స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలురు ఓ అనుమానిత వ్యక్తితో కలిసి కూలి పనులకు వెళ్తున్నట్టు తెలిసిందని, దీంతో వారిని రక్షించి గుంటూరు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించామని పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఏ ఎస్ఐ ఎస్‌కే సుభాని, హెడ్‌కానిస్టేబుల్ రామోహన్‌రెడ్డి, కానిస్టేబుల్ ఎ.సురేష్, కె.మోహన్ లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాపోటీలతో ఉద్యోగుల్లో నూతనోత్సాహం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

**లక్ష్మీపురం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలతో వారిలో నూతనోత్సాహం కలుగుతుందని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో గురువారం రెండో విడత డీఆర్ఎం కప్ క్రీడా పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్రీడాస్ఫూర్తిని పెంచేందుకు, నైపుణ్యం వెలికి తీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు. కప్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. మహిళా ఉద్యోగులను భాగస్వాముల్ని చేయాలని సూచించారు. దీనికి డీఆర్ఎం స్పందించి మరుక్షణమే ఆ సూచన అమలుకు చర్యలు చేపట్టారు. తర్వాత డీఆర్ఎం మాట్లాడుతూ... శనివారం నుంచి పోటీలు ఉంటాయని తెలిపారు. గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, నంద్యాల, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటారని వివరించారు. ప్రైవేట్ రిజిస్టర్డ్ సంస్థల వారికీ అవకాశం కల్పించామన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి , జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ, రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష, డీఆర్ఎం రామకృష్ణలు ఈ సందర్భంగా కాసేపు బాస్కెట్ బాల్ ఆడారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, సీపీఎం గుంటూరు మనోహర్‌రెడ్డి, డివిజన్ క్రీడాధికారి ఎం.దినేష్‌కుమార్, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్, డీసీఎం కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## యార్డుకు 46,017 బస్తాల మిర్చి

**కొరిటెపాడు(గుంటూరు):** గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 46,017 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 44,282 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 37,373 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

## చేనేత కార్మికుల ఆత్మహత్యలను నివారించాలి

**ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి సత్యనారాయణ**

**భట్టిప్రోలు:** చేనేత కార్మికుల ఆత్మహత్యలను వెంటనే నివారించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి ముదుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్యసాయి జిల్లా పరిగి మండలం పెద్దరెడ్డిపాలేనికి చెందిన చేనేత కార్మికుడు ఆదినారాయణ అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు చేనేత కార్మిక సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. చేనేతపై విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్, పావలా వడ్డీ తదితర పథకాలను పునరుద్ధరించాలని పేర్కొన్నారు. నేతన్నలకు ముద్రా రుణాలు 50 శాతం సబ్సిడీతో మంజూరు చేయాలని కోరారు. ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కార్మికుడు ఆదినారాయణ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సురక్ష బీమా.. కుటుంబానికి ధీమా

- పాలసీని ప్రతిష్టాత్మకంగా తెచ్చిన కేంద్రం
- బ్యాంక్ ఖాతా ఉంటే చాలు తీసుకోవడం తేలిక
- ప్రీమియం ఏడాదికి రూ.20 మాత్రమే

**కొరిటెపాడు (గుంటూరు):** కేంద్ర ప్రభుత్వం పలు బీమా పథకాలను అమలు చేస్తోంది. వాటిలో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) ఒకటి. ఇది యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీ. దురదృష్టవశాత్తు పాలసీదారు మరణిస్తే వారి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పిస్తుంది. 18 - 70 సంవత్సరాల మధ్య వయస్సు వారు బీమాకు అర్హులు. బ్యాంకు ఖాతా ఉంటే అధికారులను కలిసి వివరాలు తెలుసుకోవచ్చు. ఆటో డెబిట్ ఫెసిలిటీ యాక్టివేట్ చేసుకోవాలి. అకౌంట్ నుంచి ప్రతి సంవత్సరం మే నెల చివరిలో రూ.20 నేరుగా కట్ అవుతాయి. అందువల్ల ఖాతాదారుడు ఆ నెలలో అకౌంట్‌లో మినిమం బ్యాలెన్స్‌తోపాటు అదనంగా రూ.20 కచ్చితంగా ఉంచాలి. ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందినా రూ.2 లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి రూ.లక్ష వరకు నామినీకి అందిస్తారు. గుర్తింపు కోసం ఆధార్ కార్డు, ఫోను నంబరు, నామినీ వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై) పథకాన్ని కూడా కేంద్రం ప్రవేశపెట్టింది. ఇందులో రూ.436 వార్షిక ప్రీమియంతో అన్ని రకాల మరణాలకు రూ.2 లక్షల కవరేజీ ఇస్తారు. 18 - 50 ఏళ్ల వయస్సు మధ్య వారు ఈ బీమా పొందవచ్చు. ఈ బీమా అన్ని బ్యాంకులు, తపాలా కార్యాలయాల నుంచి తీసుకోవచ్చు.

**పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**



బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవైలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాం. నిరుపేదలకు ఇవి చాలా ఉపయోగకరం. ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే కుటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుంది. పూర్తి అంగవైకల్యం కలిగినా ఒప్పందం ప్రకారం బీమా మొత్తం చెల్లిస్తారు.

– మహిపాల్‌రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్

## 24 నుంచి ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌లు

**గుంటూరు వెస్ట్ ( క్రీడలు ):** గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి లీగ్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల జట్లు బాలబాలికల విభాగాల్లో నమోదు చేసుకోవచ్చని, దరఖాస్తులను నిర్వహణ కార్యదర్శి బ్రహ్మం ఫోన్ నెంబరు 73375 85790కు పంపాలని పేర్కొన్నారు.